


అప్రజాస్వామిక జీవోను ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్రంలో రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.వో.ను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్‌చేశారు. జీవో పేరుతో పోలీసులకు సర్వాధికారాలు కట్టబెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమన్నారు. ప్రదర్శనలకు, సభలకు అనుమతి ఇవ్వాలని కోరారు. నగరాలకు దూరంగా కాకుండా సభలు జరుపుకునేందుకు స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు.





భీమవరంలో జరుగుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభల్లో జిల్లాలో జరిగిన ఉద్యమాలను వివరిస్తున్న అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, చర్చల్లో ప్రతినిధులు

783 రోజులుగా దీక్షలు చేస్తున్న...

టిటిడి అటవీ కార్మికుల సమస్యను పరిష్కరించండి

సిఐటియు రాష్ట్ర మహాసభల్లో తీర్మానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ (భీమవరం)

తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుబంధంగా పనిచేస్తున్న 200 మంది టీటీడీ అటవీ కార్మికుల సమస్యల్ని పరిష్కరించడంలో టిటిడి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామ్య పద్ధతులపై పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం లో జరుగుతున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ తీవ్రంగా నిరసించింది. 35 ఏళ్లుగా ఒకే గొడుగు కింద పనిచేస్తున్న టిటిడి అటవీ కార్మికులలో 162 మందిని పర్మినెంట్ చేసి 200 మందిని పర్మినెంట్ చేయకపోవడంపై వివక్ష ఎందుకని ప్రశ్నించింది. ధర్మాన్ని రక్షించండి! ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది!! అని ప్రతి నిత్యం ప్రచారం చేసే టిటిడి అధర్మంగా వ్యవహరించడం ఎందుకని నిలదీసింది. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిలు కార్మికులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని మహాసభ కోరింది. టీటీడీలో 16 వేలమంది కాంట్రాక్ట్ కార్మికులను తాను అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు పలుమార్లు హామీ ఇచ్చారని, ముఖ్యమంత్రిగా సైతం తిరుపతి వచ్చిన సందర్భంగా పోరాడుతున్న టిటిడి కార్మికులతో తన హామీని అమలుపరుస్తానని చెప్పారని, ప్రకటనలు చేసి ముఖ్యమంత్రి పట్టించుకోకపోవడం సమంజసం కాదని మహాసభ అభిప్రాయపడింది. రెండు సంవత్సరాలకు పైగా న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు ఆధ్యాత్మిక కేంద్రంలో అటవీ కార్మికులు దీక్షలు చేయాల్సిన దుస్థితి మంచిది కాదని, భక్తుల, ప్రజల, కార్మికుల మనోభావాలు దెబ్బతీసినట్టు అవుతుందని మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణం టీటీడీ అటవీ కార్మికుల సమస్యను, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను టిటిడి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని మహాసభ టీటీడీ యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తిరుపతి జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను సభ దష్టికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ తీసుకువచ్చారు. కార్యక్రమంలో సిఐటియు అఖిలభారత ప్రధాన కార్యదర్శి మాజీ రాజ్యసభ సభ్యులు తపన్ సేన్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ శాసనసభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి పాల్గొన్నారు .

అర్హులందరికీ న్యాయం చేయాలి



ప్రజాశక్తి - క్యాంపస్

ఎపి పిజి సెట్ 2022 నందు అర్హత సాధించిన విద్యార్థులకు మంగళవారం నుండి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, అయితే ఇందుకు సంబంధించి అనేక రకాలైన నిబంధనలు పెట్టి విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని, తక్షణమే అర్హులైన విద్యార్థులకి న్యాయం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఓఎమ్డి హుస్సేన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్న మాట్లాడుతూ స్పాట్ అడ్మిషన్ల నందు మొదటి, రెండవ కౌన్సెలింగ్‌ల్లో అడ్మిషన్ పొంది కళాశాలలో చేరని విద్యార్థులు పేమెంట్ అడ్మిషన్, దూర ప్రాంతాలని వెళ్లని వారు అధికంగా వున్నారని, అయితే వారికి స్పాట్ అడ్మిషన్ నందు అడ్మిషన్ నిరాకరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నుండి ఎటువంటి పథకాలు వర్తించకపోయిన అప్పులు చేసుకొని విద్యార్థులు వస్తుంటే వారికి ఎపి పిజి సెట్‌లో అధికారులు బాధ్యతారాహిత్యం కారణంగా అడ్మిషన్ నిరాకరించడం సరికాదని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ స్పందిస్తూ ఎపి పిజి సెట్ కన్వీనర్ తో సంప్రదించి అర్హులైన విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రవి, ఆఫీస్ బేరర్స్ అక్బర్, ఉరుకుందు, హరిత, నాయకులు పథ్వి, మహేష్, సునీల్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు సుందర్ తదితరులు ఉన్నారు.

మహిళల చైతన్య మూర్తి సావిత్రిబాయి

ప్రజాశక్తి - తిరుచానూరు, క్యాంపస్, యంత్రాంగం



పురస్కారాలను ప్రదానం చేస్తూ...

సావిత్రి బాయి ఆశయాలను కొనసాగించాలని వక్తలు ఉద్ఘాటించారు. సావిత్రిబాయి 192వ జయంతి సందర్భంగా తిరుచానూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లాకార్యదర్శి పి.సాయిలక్ష్మి మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల ఆడపిల్లలకు వేగుచుక్క, భారత తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే అన్నారు. మహారాష్ట్రలో సతారా జిల్లాకు చెందిన నయాగావ్‌లో 1831, జనవరి 3న సావిత్రిబాయి పూలె జన్మించారన్నారు. ఓ వైపు స్త్రీల సమగ్ర అభివృద్ధి కోసం ఉద్యమాలు జరుగుతుంటే, మరోవైపు సామాజిక, ఆర్థిక దాడి, స్త్రీ అస్తిత్వాన్ని నాశనం చేసే కుట్ర మరోవైపు జరుగుతోందన్నారు. ఆనాటి ప్రజల స్థితిగతులు, సాంఘిక దురాచారాలు, అవిద్య, బాల్య వివాహాలు, సతీ సహగనం వంటివి సావిత్రిబాయిని కదిలించాయన్నారు. స్త్రీలకు విద్య, మానవ హక్కుల కోసం సావిత్రిబాయి దంపతులు గళమెత్తారన్నారు. 1890లో భర్త జ్యోతిరావుపూలె మరణిస్తే తానే చితికి నిప్పు అంటించి అంత్యక్రియలు పూర్తి చేశారన్నారు. ఆమె తెగువకు యావత్ భారతదేశం దిగ్భ్రాంతి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జయచంద్ర, జిల్లా కార్యదర్శి కె.సుమన్, సూర్య, భాస్కర్, రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు మురళి పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ సెనెట్‌హాలులో తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు. జ్ఞాన సముపార్జన ద్వారానే మానవుడు ఉన్నత స్థితిని సాధిస్తాడన్నారు. బాలికలకు పాఠశాలల్లో ప్రవేశం నిషిద్ధం అని చెబుతున్న రోజుల్లోనే తన భర్త ప్రోద్బలంతో సావిత్రిబాయి పాఠశాలలో చేరారన్నారు. జగన్మోహన్‌రెడ్డి నేడు మహిళల పేరుతోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, రాజ్యాంగ, రాజకీయ పదవుల్లో మహిళలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు. నాగలాపురంలో ఎస్‌ఎస్‌పురం హెచ్‌ఎం ఉదయచంద్రిక ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలె జయంతిని నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రఘురామయ్య, ఉపాధ్యాయులు ఉదయచంద్రిక, కమ్మర శ్రీదేవి, కంచి శ్రీదేవిలను సన్మానించారు.

ఎస్వీయూలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా ఆఫీసు బేరర్స్ అక్బర్, ఉరుకుందు మాట్లాడుతూ ఈ దేశం ఆధిపత్య భావజాలంలో నడుస్తోందని, వెనుకబడిన వర్గాలకు విద్య అందించాలనే లక్ష్యంతో వారి కోసం ప్రత్యేక పాఠశాలలు నిర్మించి మహిళలకు దిక్సూచిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, పృథ్వీ, మహేష్, సునీల్, విజయ్ పాల్గొన్నారు.

ఎస్వీ యూనివర్సిటీ ప్రకాశం భవనం వద్ద ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్ వి యూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్ ఆచార్య పద్మనాభం మాట్లాడుతూ నేడు మహిళా సాధికారత సమాజంలో మహిళలకు సమానమైన హక్కులు కలిగి ఉండాలని ,మహిళల విద్య ఆవశ్యకతను గుర్తించిన వీరవనిత సావిత్రిబాయి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య శ్యామ్ డేవిడ్, బహుజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు చందు పాల్గొన్నారు.

పుత్తూరు డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు ఎ.దేవకి, నీరజ, గౌరి, శ్రీదేవి, సుజల, గాయత్రి, స్వాతి, వరలక్ష్మి, వీరయ్య, నరసింహులు పాల్గొన్నారు. రేణిగుంటలో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో అధ్యక్షులు జూలియన్ రాజు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. జూలియన్‌రాజు మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి అయిన సావిత్రిబాయి పూలే నిమ్నవర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. అమ్ములురాజు, రమేష్, మునీంద్ర, విజయ పాల్గొన్నారు. పాకాలలోని మొగరాల జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గోపి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. శ్రీకాళహస్తి మండల విద్యా వనరుల కేంద్ర ఆవరణలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. మండల విద్యా వనరుల శాఖ అధికారి ఆర్.భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పి.శివకుమార్, ప్రశాంత్, మాధవ్, లలిత పాల్గొన్నారు

మహిళల విద్యాభివద్ధి కోసం నిరంతరం కృషిచేసి వారి జీవితాలలో వెలుగులు నింపిన స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి పూలే అని, ఆమెను ఆదర్శంగా తీసుకొని నేటి మహిళలు సమాజంలో రాణించాలని తెలంగాణ, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళ సై సౌందర్య రాజన్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఫౌండేషన్ చైర్మన్ ఎన్న గొని తులసీరామ్ ఆధ్వర్యంలో ఎల్‌ఐసి రోడ్డులోని ఆఫీసర్స్ క్లబ్ సమావేశ మందిరంలో మంగళవారం సావిత్రిబాయి పూలే 192 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమిళసై సౌందర్య రాజన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ఉత్తమ సేవలు అందిస్తున్న 80 మంది సాంఘిక సంస్కర్తలు, సంఘ సేవకులకు, సావిత్రిబాయి పూలే ఎక్సలెన్స్ అవార్డ్స్- 2023 ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి గుర్రప్ప, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వై జె పి ప్రసాద్ రెడ్డి, బీసీ చైతన్య వేదిక కన్వీనర్ గోపాల్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బట్ట భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.



పుత్తూరులో...



నాగలాపురంలో..

అవ్వాతాతలకు 'పింఛన్ కానుక' : డిప్యూటీ సిఎం



పింఛన్ కానుక ప్రారంభసభలో నారాయణస్వామి

ప్రజాశక్తి - క్యాంపస్

అవ్వాతాతలకు పింఛన్ కానుకగా ఇచ్చి మాటతప్పని, మడమ తిప్పని నేతగా జగనన్న మహనీయుడుగా నిలిచిపోయాడని ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి అన్నారు. మంగళవారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాజమండ్రి నుంచి వైఎస్‌ఆర్ పింఛన్ కానుక పెంచిన మొత్తాన్ని ప్రారంభించారు. తిరుపతి ఎస్వీయూ ఆడిటోరియంలో జిల్లాస్థాయి పింఛన్ల కానుక పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపి డాక్టర్ గురుమూర్తి, ఎంఎల్‌ఎలు భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆదిమూలం, నగర మేయర్ డాక్టర్ శిరీష, కలెక్టర్ వెంకట రమణారెడ్డి, కమిషనర్ అనుపమ అంజలి పాల్గొన్నారు.

జిల్లాలో వైయస్సార్ పెన్షన్ కానుక వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రగిరి నియోజకవర్గంలో గతంలో ఇస్తున్న పింఛన్ల సంఖ్య 43,161 కాగా కొత్త పింఛన్లు 1333 , గూడూరు నియోజకవర్గం లో 38768 (1303), నగరి నియోజకవర్గం 14555(404), సత్యవేడు నియోజకవర్గంలో41610(1100), శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 40600(1274), సూళ్లూరుపేట నియోజకవర్గంలో 38333 (1274), తిరుపతి నియోజకవర్గంలో 21118(734), వెంకటగిరి నియోజకవర్గంలో పాత పింఛన్లు 21312 కాగా కొత్తవి 648 ఉన్నాయి. జిల్లాలో మొత్తం పాత పింఛన్లు 259457 కాగా కొత్తగా 8070 మందికి మొత్తం 267527 మందికి రూ. 74,07,63,750 లబ్ధి చేకూరింది. ఈ కార్యక్రమంలో పీడీలు డిఆర్డిఎ , డ్వామా జ్యోతి, రాధమ్మ, పాలక డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి పాల్గొన్నారు.

అయ్యా పింఛను తొలగించారు



ప్రజాశక్తి -బాలాయపల్లి

'అయ్యా కూలి పనులకు వెళితే గాని పూటగడవని పరిస్థితి. నాకు ఎటువంటి ఆధారం లేదు. అయితే నా పేరు మీద మూడుఎకరాల మాగాణి ఉన్నట్లు చూపుతోందంట.. ఆ భూమి నాదే కానీ బిడ్డలకు పంచి ఇచ్చేశాను. నేను ఒంటరిగా జీవనం సాగిస్తున్నా. ఎవరైనా ఒక పూట భోజనం పెడితేనే నా పొట్ట నిండుతుంది' అని బాలాయపల్లి మండలం గొట్టిపాడు గ్రామానికి చెందిన మస్తానమ్మ వాపోయారు. ఎంఎల్‌ఎ ఆనం రాంనారాయణరెడ్డి వద్ద కన్నీరుమున్నీరయ్యారు. ఆసరాగా ఉన్న పింఛన్‌ను తొలగించడం అన్యాయమని, న్యాయం చేయాలని దండం పెట్టి వేడుకున్నారు.

'నేతన్న' హస్తానికి...రాజకీయ 'రంగు'

అకౌంట్లో డబ్బు వెనక్కివ్వాలని వేధింపులు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం



బాధితురాలు

సంక్షేమ పథకాలు రాజకీయ రంగు పులుముకుంటున్నాయి.. ఎపుడు సంక్షేమ పథకం అందుతుందో, ఎపుడు అందదో అగమ్యగోచరంగా మారింది.. నిన్న మొన్నటివరకూ లబ్దిదారుగా ఉండేవారికి నోటీసులు అందుతున్నాయి. 'వెరిఫికేషన్' పేరుతో పథకాల లబ్దిలో తూట్లు పొడుస్తున్నారు. వరదయ్యపాళెం మండలంలో వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం నిజమైన లబ్దిదారులకు అందని ద్రాక్షలా మారింది.

వరదయ్యపాలెం పంచాయతీ గోవర్ధనపురం గ్రామానికి చెందిన ఉమ్మిటి హరిహరయ్య కుటుంబానికి నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మూడు దఫాలుగా నేతన్న నేస్తం రావడం లేదు. ఈ విషయమై సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్‌ను వివరణ అడగ్గా పొంతనలేని కారణాలు చెబుతుండటం గమనార్హం. అధికారుల నిర్లక్ష్యం వల్ల మూడు దఫాలుగా 72వేల రూపాయలను కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కారిపాకం పంచాయతీ బాలసుబ్రమణ్యంపేట (బిఎస్ పేట) గ్రామంలో 15 మందికి పైగా నేతన్న నేస్తానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆరు రకాల వెరిఫికేషన్ జరిగిన తరువాత నలుగురికి మాత్రమే నేతన్న నేస్తం లబ్ది వారి అకౌంట్‌లో జమ అయ్యింది. అయితే కారిపాకం సచివాలయ సిబ్బంది సాకేంతిక కారణాలని, తమ సిబ్బంది పొరబాటు వల్ల డబ్బులు మీ అకౌంట్‌లో పద్దాయని, పడిన డబ్బు వెనక్కి ఇచ్చేయాలని వేధిస్తున్నారు. తాము మొదటినుంచి చేనేత వృత్తిమీదనే ఆధారపడి జీవిస్తున్నామని, ఇటీవల తన భర్త అనారోగ్యంతో మృతిచెందాడని, తాను కూడా మగ్గం నేస్తున్నానని తెలిపారు. అన్ని విధలా విచారణ జరిగిన తరువాతనే గతంలోలా ఈసారి అకౌంట్‌లో డబ్బులు పద్దాయని ఆమె తెలిపారు. పడిన డబ్బును వాడుకున్నానని, అధికారులు ఇపుడు వచ్చి అడిగితే ఎలా అని వాపోయారు. పేపర్‌మీద ఏదో రాసి తన దగ్గర సంతకం పెట్టించుకున్నారని పేర్కొంది. డబ్బులు కట్టకపోతే కేసు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపింది. అర్హత ఉన్నప్పటికీ వేధింపులకు పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. తిరుపతి అర్బన్ పరిధిలో పేదలకు ఇండ్లు కేటాయించిన జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల పురోగతిపై ఇంజినీరింగ్, హౌసింగ్, రెవిన్యూ అధికారులతో మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిని హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించాలన్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో పెరిగిన మొక్కలు వెంటనే తొలగించాలన్నారు. అలాగే వీధుల్లో ఏర్పడిన గుంతలు పూడ్చి వాహనాలు సజావుగా వెళ్లి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ పి.డి. బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి ఉన్నారు.



ఏపీ ఎన్జీవో అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నగర శాఖ నూతన సంవత్సర 2023 టేబుల్ క్యాలెండర్‌ను కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నగర శాఖ అధ్యక్షులు ఎస్ సురేష్ బాబు కలెక్టర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగర శాఖ కార్యదర్శి జి బాలాజీ, కోశాధికారి టి సుధాకర్ రెడ్డి, సహ అధ్యక్షులు ఎం శ్రీనివాసులు, శంకర్, రఘు, భువనేశ్వరి, వేణుగోపాల్, హరికష్ణ, ప్రేమలత, నరేష్, తులసమ్మ, పద్మజ తదితరులు పాల్గొన్నారు

ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు సాదర స్వాగతం

రేణిగుంట : ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు తిరుపతి జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కొండయ్య శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



సంక్రాంతి పండుగ పురస్కరించుకుని డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ కబడ్డీ టోర్నమెంట్‌ను మంగళవారం తిరుపతి ఇస్కాన్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జయచంద్ర, జిల్లా అధ్యక్షులు ఎం.నరేంద్ర, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సాయిలక్ష్మి కబడ్డీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు సమాజంలో ఆటలకు సమాయాన్ని కేటాయిస్తున్న పరిస్థితి లేదన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఆటలనేది ప్రధానమన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడ అయిన కబడ్డీ ఇటీవల కాలంలో కనుమరుగవుతోందన్నారు. ఇప్పటికే క్రీడా మైదానాలను ప్రైవేట్‌కు అప్పజెబుతూ, డబ్బులిచ్చి ఆడుకునే పరిస్థితి కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, చరణ్, విజయ్, అనిల్, గౌతమ్, పవన్, సోము పాల్గొన్నారు.

ఆక్రమణల్లో రాచగున్నేరి చెరువు

రోజురోజుకూ పెరుగుతున్న ఆక్రమణలు
పోరంబోకు స్థలంలో రాత్రికిరాత్రే షెడ్ల నిర్మాణం



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్

రాచగున్నేరి చెరువు రోజురోజుకూ కుంచించుకుపోతోంది.. పోరంబోకు స్థలాన్ని చదును చేసి కబ్జాదారులు సొంతం చేసుకుంటున్నారు. రాత్రికిరాత్రే షెడ్లను నిర్మిస్తున్నారు. ఏ పంచాయతీ పరిధిలో లేనన్ని పరిశ్రమలు ఇక్కడ కొలువై ఉండటమే ప్రధానమైన కారణం.

మండలంలో మొత్తం 46 పంచాయతీలు ఉన్నాయి. రాచగున్నేరి మేజర్ పంచాయతీగా పేరుగాంచింది. ఈ పంచాయతీకి కర్మాగారాల నుంచి భారీగా పన్నులు వస్తుంటాయి. ఈ నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారికి ఇరువైపులా విస్తరించి ఉంది. నాయుడుపేట నుంచి పూతలపట్టుకు వెళ్లే ఈ జాతీయ రహదారి గుండా నిత్యం ఎన్నో వేల లారీలు, బస్సులు, కారులు, ద్విచక్రవాహనాలు వచ్చి వెళుతుంటాయి.ముఖ్యంగా తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో కేంద్ర ప్రభుత్వం ఈ జాతీయ రహదారి విస్తరణ పెంచాలనే ఉద్దేశ్యంతో నిర్మాణ పనులు చేపట్టారు. ఈ రహదారి అభివృద్ధి చెందే క్రమంలో రాచగున్నేరి చెరువు పోరంబోకు స్థలం కుంచించుకుపోతోంది. సర్వేనంబర్ 296లో కొంతమంది కబ్జాదారులు ఎవరికి వారే ఇష్టం వచ్చినట్లుగా ఆక్రమించుకుని ఇష్టానుసారంగా రాత్రికి రాత్రే షెడ్లు నిర్మించుకుంటున్నారు. లక్షల విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సచివాలయం పరిధిలో భూములను కాపాడాల్సిన పంచాయతీ కార్యదర్శి ఏం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రాచగున్నేరి చెరువు పోరంబోకులో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించి, లక్షలు విలువ చేసే ప్రభుత్వం భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శిదే బాధ్యత : జరీనాబేగం, తహశీల్దార్ శ్రీకాళహస్తి

జీవో నంబర్ 188 ప్రకారం పంచాయతీరాజ్ పరిధిలో గ్రామకంఠం, చెరువు పోరంబోకు, మేత భూములను ఎవరైనా ఆక్రమిస్తే వాటిని తొలగించే బాధ్యత పంచాయతీ కార్యదర్శిదే. విఆర్‌ఒను, సర్వేయర్‌ను తీసుకెళ్లి సర్వే చేయించి ప్రభుత్వ భూమి అని నిర్ధారణ అయితే వెంటనే ఆక్రమణలను తొలగించాలి. ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపడతాం.

మాకు సంబంధం లేదు : యూసుఫ్‌ఖాన్, డిడిఒ


పంచాయతీలో ఉన్న చెరువు పోరంబోకు స్థలాలపై మాకు ఎటువంటి అధికారం లేదు. ఇది మాకు సంబంధించిన పనికాదు. రెవెన్యూ అధికారులు స్పందిస్తే మేం సహకరిస్తాం.

ప్రమాదకరంగా మూల మలుపులు

ప్రజాశక్తి - ఓజిలి

మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రమాదకరమైన మూల మలుపుల వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మలుపులు ఉన్న ప్రదేశాల్లో ఆర్.అండ్.బి అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులకు మలుపులు ఉన్నట్లు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు .మలుపులకు సమీపంలో వేగ నిరోధకాల ఏర్పాటుకు చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో అయ్యప్ప స్వామి ఆలయం , ప్రధాన మార్కెట్ మూలమలుపు వద్ద పలు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పటికీ ఆర్.అండ్.బి అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాహన చోదకులు అధికారులపై మండిపడుతున్నారు.

మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక పోవడంతో పలుసార్లు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పాఠశాల ముందు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అధికారులు వాటిపై శ్రద్ధ చూపకపోవడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఎక్కడ ప్రమాదాలకు గురవుతారోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు



గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, వాహనదారులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సిరుగురాజుపాళెంలో తాగునీటి సౌకర్యంతోపాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని.. పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని సర్పంచ్ మురళీమోహన్ యాదవ్ అన్నారు. మంగళవారం సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి అందుబాటులో ఉన్నారని..ఎలాంటి సమస్యలైనా తన దృష్టికి తీసుకొస్తే మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పింఛన్లు అందని వారుంటే వెంటనే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంచాయతీలోని మంచినీటిగుంట, దాసరిగుంట, చింతచెట్లకు వేలం నిర్వహిస్తామన్నారు. అలాగే ఊరికి మొటల్లోని దిబ్బలని తొలగించాలని ప్రజలు గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. కరోనా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మురళీ, వీఆర్వో రవికుమార్, పంచాయతీ కార్యదర్శి హరిత, ఏపీవో భార్గవి, సచివాలయం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, వాలంటీర్లు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు వైద్యసేవలు



ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పట్టణంలో సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డీఆర్‌యూసీసీ మెంబర్ శ్యామసుందరరావు ఆధ్వర్యంలో మంగళవారం గూడూరు రైల్వే డాక్టర్ శ్రీనివాస్ సుందర్ కుమార్ సూచనలు మేరకు రైల్వే హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ప్రవీణ్ ఐ కేర్ నేత్ర ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సత్యశ్రీ, నారాయణ డెంటల్ వైద్యులు డాక్టర్ నారాయణ సుమారు 150 మంది రైల్వే ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గూడూరు రైల్వే డాక్టర్ శ్రీనివాస్ సుందరకుమార్, మెడికల్ స్టాఫ్, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో నూతన సంవత్సర వేడుకలు



ప్రజాశక్తి-పిచ్చాటూరు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కోసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించడం అందరి కర్తవ్యమని.. అలాగే 108, 104 వాహనాలతో సేవలు అందిస్తున్నామని తెలిపారు. కరోనా నివారణకు ప్రజలు తప్పక మాస్క్ ధరించాలని.. అనారోగ్యం పడిన సమయంలో ప్రభుత్వ డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్ స్టాఫ్, నర్సులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ కన్వీనర్‌గా వెంకటరమణ



ప్రజాశక్తి-సత్యవేడు: మాదిగ విద్యార్థులను వర్గీకరణ సాధనలో భాగస్వాములను చేసి నియోజకవర్గంలోని మాదిగ విద్యార్థులను చైతన్య పరచాలని నూతనంగా ఎంపికైన సత్యవేడు నియోజకవర్గ ఎంఎస్‌పీకన్వీనర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం సత్యవేడులో జరిగిన కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు సద్దుల నవీన్ కుమార్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగేంతవరకు నిరంతరం పోరాడుతామని తెలిపారు.

వెంకటమ్మ అంత్యక్రియల్లో బొల్లినేని



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని వేలవేడు పంచాయతీలో నివాసం ఉంటున్న వెంకటమ్మ అనారోగ్యంతో మతి చెందింది. షయం తెలుసుకున్న జె.కె స్టీల్స్ అధినేత, రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథం నాయుడు మంగళవారం పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అందుబాటులో వైద్య సేవలు

ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని జయంపు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయడం జరిగిందని.. ప్రైవేటు భవనాలు గుర్తించి త్వరలో పరిసర ప్రాంతాల వారికి వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎంపీపీ భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాలాయపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జయింపు గ్రామంలో బీసీ బాలుర రెసిడెన్షియల్ సైతం మంజూరైందని.. ఈ పాఠశాలను వెంకటగిరి పట్టణంలో నిర్వహిస్తున్నామని.. ఏర్పాటుకు స్థల సేకరణ జరిగిందన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో రూ.40 కోట్లతో ఏర్పేడు-చెన్నూరు రోడ్డు పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాన పార్వతి, జయంపు సహకార సంఘం అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి, ఎంపీడీవో వినిల్ కుమార్, తహసీల్దార్ అజ్మీతుల్లఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యంతో ఆగిన 'గౌడ సొసైటీ' ఎన్నికలు



ప్రజాశక్తి -బాలాయపల్లి: గౌడ సొసైటీ ఎన్నికలు మంగళవారం జరగాల్సి ఉండగా రాజకీయ జోక్యంతో మండలంలోని మన్నూరు గ్రామంలో వాయిదా వేశారు. అధికార పార్టీకి చెందిన స్థానిక ఎంపీటీసీ అభ్యర్థి ఓటమి పాలవుతారన్న భయం తో ఎన్నికలను అడ్డు కున్నట్లు తెలుస్తోంది. ఈ సొసైటీ పరిధిలో 63 ఓట్లు ఉండగా ఎక్సైజ్ అధికారులు మంగళవారం సొసైటీ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో అభ్యర్థులు పోటాపోటీ గా తమ బలాలను నిరూపించుకునేందుకు సిద్ధమయ్యి స్థానిక పాఠశాల వద్దకు చేరుకున్నారు. ప్రత్యర్థి వర్గానికి 35 ఓట్లు ఉండడం తో ఓటమి రుచి చూడాల్సి వస్తుందన్న భయం తో ఎంపీటీసీ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఎక్సైజ్ అధికారులతో ఒప్పందం కుదుర్చుకుని ఎన్నిక జరగకుండా అడ్డుకున్నారని ఓటర్లు వాపోతు న్నారు. ఇకనైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'ఆనం'కు చెక్...?



వెంకటగిరి ఇన్‌ఛార్జిగా రామ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో


ఆనం రాంనారాయణరెడ్డి ఇటీవల బహిరంగ వేదికలపై వరుసగా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకుంది. ఆనం వ్యవహార తీరుపై సీఎం జగన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలను పిలిచి ఆనం వ్యవహారంపై చర్చించారు. కొంతకాలంగా ఆనం విమర్శలు చేస్తున్నా.. వేచి చూసే ధోరణిలో ఉన్న వైకాపా అధిష్ఠానం.. రెండు, మూడ్రోజులుగా బహిరంగ వేదికలపై నుంచే ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేస్తుండటంతో ఇకపై ఉపేక్షించకూడదని నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

ఈ నేపథ్యంలో ఆనం రామనారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని పార్టీ ముఖ్యనేతలకు సీఎం ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. సీఎం ఆదేశాల మేరకు వైకాపా అధిష్ఠానం ఆనంపై చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో వెంకటగిరి నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి ఎమ్మెల్యే ఆనంను తొలగించారు. వెంకటగిరి ఇన్‌ఛార్జిగా మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుమారుడు రామ్‌కుమార్‌రెడ్డిని ప్రకటించారు. ఇన్‌ఛార్జిల మార్పుపై వైకాపా కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇన్‌ఛార్జిగా తొలగించడం ద్వారా నెల్లూరు జిల్లాలో ఆనం రామనారాయణరెడ్డి ప్రాధాన్యతను తగ్గించేలా చర్యలు తీసుకుంది. ఇకపై విమర్శలు చేయకుండా కట్టడి చేయాలని భావిస్తోంది. వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి రామ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలను పాటించాలని స్థానిక అధికారులకు పార్టీ ముఖ్యనేతలు ఆదేశించినట్టు సమాచారం.

వేచి చూద్దాం.. ఏం జరుగుతుందో?: ఎమ్మెల్యే ఆనం

వైకాపా వెంకటగిరి ఇన్‌ఛార్జి మార్పు వార్తలపై ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. "ఇన్‌ఛార్జి నియామకంపై నాకు సమాచారం లేదు. ఊహాగానాలపై స్పందించను. ఇన్‌ఛార్జి నియామకంపై ఆదేశాలు వచ్చాక స్పందిస్తా. మంత్రులు నాపై చేసిన వ్యాఖ్యలు విన్నాకే స్పందిస్తా. ఇవాళ కూడా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నా. ప్రభుత్వ పనులు ఆలస్యం అవుతున్నాయన్నదే నా ఆవేదన. వేచి చూద్దాం.. ఏం జరుగుతుందో? ముందస్తు ఎన్నికలు వస్తే బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు వస్తాయనే చెప్పా"అని ఆనం రామనారాయణరెడ్డి మీడియాతో అన్నారు.

ఉడుమలపాడులో 'ఇదేం ఖర్మ..మన రాష్ట్రానికి'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తిరూరల్: మండలంలోని ఉడుమలపాడు పంచాయతీలో మంగళవారం టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు 'ఇదేం ఖర్మ ..మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షంగా, సురక్షితంగా ఉండేవారని తెలిపారు. ప్రస్తుతం సామాన్య, పేద ప్రజలు నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ఎలా బతకాలో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు పడుతున్న కష్టాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ యువత అధ్యక్షులు కష్ణ యాదవ్, సతీష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలాయపల్లిలో అభివృద్ధికి నిరంతర కృషి



ప్రజాశక్తి-బాలాయపల్లి: మౌలిక వసతులతో బాలాయపల్లి మండలాన్ని అభివృద్ధి చేస్తామని మాజీ ఆర్థిక శాఖ మంత్రి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. మండలంలో రూ.11.49 కోట్లతో 43 భవనాలను నిర్మిస్తున్నామన్నారు. మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.60 కోట్లతో పనులు చేపడుతున్నామని తెలిపారు.

'తిరుపతి రూరల్ ఎంపీడీవోపై కోర్టును ఆశ్రయిస్తా'



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నూతన సంవత్సరం సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుపతి రూరల్ రామచంద్రపురం, చంద్రగిరి మండలాల్లోని ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి సొంత ఖర్చుతో గోడ పత్రికలను ముద్రించి అంటించామని తిరుపతి రూరల్ కుంట్రపాకం పంచాయతీ మాజీ సర్పంచ్ జీపాల్యం బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం ఎంపీడీవో తాను ఏర్పాటు చేసిన గోడ పత్రికలను పంచాయతీ సిబ్బందితో తొలగించారన్నారు. ప్లాస్టిక్ వినియోగం అయితే అభ్యంతరం చెప్పాలని.. పేపర్తో తయారుచేసిన గోడపత్రికలను ఏ జీవో ఆధారంగా తొలగించాల్సి వచ్చిందో ఎంపీడీవో సమాధానం చెప్పాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు. తాను ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి అర్హుడిని కాదా.. అని ఎంపీడీవో ను ప్రశ్నించారు. ఎంపీడీవో వెనుక బలమైన రాజకీయ నాయకుల ఒత్తిడి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. 30 సంవత్సరాలుగా సర్పంచ్ గా ప్రజలకు సేవలు అందించిన తాను నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి గోడపత్రికలను ముద్రిస్తే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో ఉద్దేశపూర్వకంగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు సమాచారాలు పంపి తొలగించారని, నా పరువుకు భంగం కలిగినందున కలెక్టర్ ను కలిసి విన్నవిస్తానన్నారు. సరైన సమాధానం రాని పక్షంలో కోర్టును ఆశ్రయిస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి.. నిషేదించాలన్నారే తప్ప పేపర్ వినియోగాన్ని ఆపేయాలని ఎక్కడ చెప్పారో ఎంపీడీవో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జీపాల్యం అవినాష్‌రెడ్డి, షామీర్‌బాషా పాల్గొన్నారు.

రోజా 'యూ టర్న్'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



జాతీయ రాజకీయాల్లోకి వెళ్లిన తెలంగాణా ముఖ్యమంత్రి కెసిఆర్‌పై ఏపీ మంత్రి ఆర్‌కె రోజా విమర్శలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. గతంలో కెసిఆర్, టిఆర్‌ఎస్ నేతలతో రోజా స్నేహసంబంధాలను కొనసాగించారు. ఇపుడూ వ్యక్తిగతంగా మంచి సంబంధాలే ఉన్నాయి. గతంలో నగరిలో రోజా ఇంటికి సీఎం హోదాలో కేసీఆర్ వెళ్లారు. రోజా ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఆమెను ఆశీర్వదించారు. కేసీఆర్‌ను తన తండ్రిగా రోజా భావిస్తుంటారు. ఈ విషయాన్నే పలు సందర్భాల్లో రోజా బహిరంగంగా చెప్పారు. తెలంగాణలో ఆధ్మాత్మిక కార్యక్రమం ఏదైనా కేసీఆర్ వెంట నీడలా నడిచే వైసీపీ ఎమ్మెల్యేలు ఆర్కే రోజా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తిరుగుతుంటారనే సంగతి అందరికీ తెలుసు. ఈ ఇద్దరు నేతలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వారే కావడం గమనార్హం.

ఈ నేపథ్యంలో కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లడం, బీఆర్‌ఎస్‌ను స్థాపించడం , దాన్ని ఏపీలో విస్తరిస్తున్న నేపథ్యంలో రోజా విమర్శలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రోజా మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్‌పై విమర్శలు చేయడం గమనార్హం. రాష్ట్రాన్ని ముక్కలు చెక్కలు చేసిందే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అని విరుచుకుపడ్డారు. తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారన్నారు. ఏపీలో అడుగుపెట్టడం ఎంత వరకు సబబు అని రోజా బీఆర్‌ఎస్ నేతల్ని ప్రశ్నించారు.

కొత్త రాష్ట్రాన్ని కోరుకునే వారే రాజధాని కట్టుకోవాల్సి ఉంటుందన్నారు. కానీ హైదరాబాద్‌ను తెలంగాణకు కేటాయించారన్నారు. రాష్ట్ర విభజనతో ఏపీ నష్టపోయిందన్నారు. ఆ నష్టాన్ని ఇప్పటికీ భర్తీ చేయలేదని ఆమె విమర్శించారు. బీఆర్‌ఎస్‌లో చేరే ఏపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు. నిన్నటి వరకూ బీఆర్‌ఎస్ నేతలతో రాసుకుపూసుకు తిరిగిన రోజా... అకస్మాత్తుగా యూ టర్న్ తీసుకోవడం చర్చకు తెరలేచింది. ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో వున్నారని కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో, ఆ ఎఫెక్ట్ రాజకీయంగా తనపై పడుతుందనే భయంతో రోజా ఉద్దేశ పూర్వకంగానే ఇలా మాట్లాడు తున్నారా? అని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయాలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నామని.. గతంలో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిలబెట్టుకుంటున్నారని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. పెన్షన్ వారోత్సవాలలో భాగంగా వడమాలపేట మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ' వైఎస్సార్ పెన్షన్ కానుక' పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఆర్ కే రోజా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో పింఛను మంజూరు కావాలంటే ఆ వ్యక్తి చనిపోతే గాని కొత్త వారికి పింఛను ఇచ్చేవారు కాదని.. నేడు అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్నారని.. ప్రతిఒక్కరూ ఆయనకు అండగా నిలవాలని కోరారు. వడమాలపేట మండలంలో 5,099 మందికి రూ.1.41,77,750 పెన్షన్లు ఇస్తుండగా.. కొత్తగా 183 మందికి రూ.5,11,000 పెన్షన్ల నిమిత్తం మంజూరు చేశారని చెప్పారు. మండలంలో ప్రస్తుతం మొత్తం 5,282 మందికి రూ.1,46,88,750 పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దారు, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు, బోర్డు మెంబర్లు, డైరెక్టర్లు, ఛైర్మన్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయంలో ఏర్పాటుచేసిన పెన్షన్ వారోత్సవాలలో ఎమ్మెల్యే వేలగపల్లి వరప్రసాద్ రావు పాల్గొన్నారు. పెంచిన పింఛన్లను ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సాయినాథ్, వైసీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, నాయకులు బోమిడి శ్రీనివాసులు, నాగులు, అజీజ్ ఖాన్, మురళీ తదితరులు పాల్గొన్నారు.



శ్మశానానికి దారి కల్పించాలని వినతి



ప్రజాశక్తి-సత్యవేడు: వరదయ్యపాలెం మండలం చిన్నపాండూరు అరుంధతివాడ వాసులకు శ్మశానానికి వెళ్లేందుకు దారి కల్పించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కో కన్వీనర్ రాగిపట్టు రాఘవయ్య గ్రామస్థులతో కలిసి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కోకన్వీనర్ గౌరీభాస్కర్, నాయకులు పసుపులేటి రాఘవ, దొరబాబు, సుధాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేతాజీనగర్ పాఠశాల తనిఖీ



ప్రజాశక్తి- దొరవారిసత్రం: నేతాజీనగర్ గ్రామ పరిధిలోని మండల ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో వస్తానయ్య పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పిల్లలకు వండిన ఆహారాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్ కే వహీదా తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు లెమన్ మార్కెట్



ఎదురుగా ఉన్న సాయి బాలాజీ రైతు డిపో ఎరువుల దుకాణంలో సహాయ వ్యవసాయ సంచాలకులు గోపినాయక్, ఏవో రమేష్ మంగళవారం తనిఖీ చేపట్టారు. పొటాష్ ఎరువు శాంపిల్‌ను తీసి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఫలితాలు వచ్చేవరకు దుకాణంలోని పొటాష్ ఎరువును అమ్మరాదని సూచించారు. కల్తీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తిరుమల తరహాలో మాడవీధుల అభివృద్ధి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తిరుమల తరహాలో పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి నాలుగు మాడ వీధులను అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. రూ. 8 కోట్ల వ్యయంతో మంగళవారం నాలుగు మాడవీధుల్లో దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేర భూగర్భ విద్యుత్ లైన్ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రథోత్సవ అనుభవాల దష్ట్యా నాలుగు మాడ వీధుల్లో భూగర్భ విద్యుత్ లైన్ పనులకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. 40 రోజులలో పనులు పూర్తి చేసి 2023 శివరాత్రి రథోత్సవానికి ఎటువంటి ఆటంకం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, గుమ్మడి బాలకష్ణయ్య, లోకేష్ యాదవ్, చంద్రయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి పూర్వ వైభవం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు గెడిపూడి విజయ్ కుమార్ నాయుడు అన్నారు. ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 21వ వార్డులో టీడీపీ నాయకులు పర్యటించారు. నిత్యావాసర వస్తువులు, కరెంట్ బిల్లులు, ఇసుక, ఇంటి పన్నులు ఎలా పెరిగాయో ప్రజలకు విజయకుమార్ వివరించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని విధాలుగా నష్టపోయామంటూ ప్రజలు టిడిపి నాయకులు ఎదుట వాపోయారు. టీడీపీ కి ఓట్లేస్తే అభివద్ధికి ఓట్లు వేసినట్లేనని ఆయన పిలుపునిచ్చారు.

ఆశా కార్మికుల మహాసభను జయప్రదం చేయండి



ప్రజాశక్తి-సత్యవేడు: పుత్తూరు పట్టణంలో జనవరి పదో తేదీన నిర్వహించనున్న ఆశా కార్మికుల జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని సత్యవేడు నియోజకవర్గం ఏఐటీయూసీ నాయకుడు తరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సత్యవేడులో జిల్లా మహాసభలకు సంబంధించి కరపత్రాలను ఆయన ఆశాకార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు నాగార్జున, ఆశ కార్మికులు వాణి, మల్లెమ్మ, అంజిలి. పుష్పలత, విజయ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో వృద్ధుల అవస్థలు



ప్రజాశక్తి-బాలాయపల్లి: పింఛన్ల పంపిణీ మేళా కార్యక్రమానికి హాజరు కాకుంటే పింఛను ఆపేస్తామని అధికారులు చెప్పడంతో మండలంలోని సుధీర ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వృద్ధులు నడవలేని స్థితిలో హాజరయ్యారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రావడం ఆలస్యం కావడంతో అవస్థలు పడక తప్పలేదు. మండలంలోని సుదూర ప్రాంతాల నుంచి రూ.వెయ్యి ఆటో బాడుగ పెట్టుకొని మండల కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే కనీసం తాగేందుకు నీళ్ల లేవు. వసతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

జగనన్న కాలనీలో ఆర్డీవో పరిశీలన



ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలోని అడుసుపాలెం జగనన్న కాలనీలో మంగళ వారం ఆర్డీవో రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల పనులు పరిశీలించి అభివృద్ధిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రేణిగుంట ఇన్‌ఛార్జి ఎంపీడీవో హరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలవగుంట భరత్‌రెడ్డికి సన్మానం




ప్రజాశక్తి-తొట్టంబేడు: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన కలవగుంట భరత్ రెడ్డికి మంగళవారం గొట్టిపూడి, రాంబట్లపల్లె యువత ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భరత్ రెడ్డి గత కొన్నేళ్లుగా తొట్టంబేడు మండలంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మణి, బాబు, రాము భాను, మణికంఠ, శరత్, సుబ్బయ్య, సాయి, గోపి, మహేష్, సూరి, గోవింద్, శంకరయ్య, పవన్, సురేష్, లితీష్, రామకష్ణ పలువురు యువత పాల్గొన్నారు.

అట్టహాసంగా మహిళా వర్సిటీలో యువజనోత్సవం ప్రారంభం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో దక్షిణాది ప్రాంతా రాష్ట్రాల అంతర విశ్వవిద్యాలయాల సంగీత నత్య కళా పోటీలు మంగళవారం కళాకారుల ర్యాలీతో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున మాట్లాడుతూ గతంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రెండు సార్లు దక్షిణాది రాష్ట్రాల అంతర్ విశ్వవిద్యాలయాల యువజన ఉత్సవాలను నిర్వహించడం జరిగిందని వెల్లడించారు. 36వ దక్షిణాది రాష్ట్రాల అంతర్ విశ్వవిద్యాలయాల సంగీత, నత్య పోటీలను తిరుపతి కేంద్రంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వివిధ దక్షిణాది రాష్ట్రాల నుంచి 18 విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు సంగీతం నత్య పలు విభాగాలలో ఈ పోటీల్లో పాల్గొని విజయం పొందినవారు జాతీయస్థాయి యువజన ఉత్సవాలలో పాల్గొంటారని వెల్లడించారు. కళాకారులు, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని వారి సహకారం పద్మ తరంగ్ కు మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, వివిధ రాష్ట్రాల చెందిన సంగీత, నత్య కళాకారులు పాల్గొన్నారు.

21 మద్యం బాటిళ్లు పట్టివేత



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట నుంచి జువ్వలపాలెంకు వెళ్ళు రోడ్డు మార్గం వద్ద సెబ్ సీఐ వారి బందం తో మంగళవారం ఉదయం తనిఖీలు నిర్వహిస్తుండగా 21 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. చిట్టమూరు మండలం మొలకలపూడి గ్రామానికి చెందిన పి. చెంచయ్య కుమారుడు పట్టాభి. అల్లయ్య వద్దనుండి 21 బ్రిలియంట్ బ్రాండ్ విస్కీ మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు నాయుడుపేట సెబ్ సీఐ ఆర్.యూ.వి.ఎస్ ప్రసాద్ తెలియజేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేసి కోర్టులో హాజరు పరిచగా న్యాయస్థానం అతనిని రిమాండకు పంపినట్లు తెలిపారు. ఈ దాడులలో సెబ్ కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, మల్లికార్జున, తిరుమల రావు, సురేష్ పాల్గొన్నారు.